క్లుప్తంగా

వేసవి దుక్కులు..



తురకపేట ప్రాంతంలో వేసవి దుక్కి చేస్తున్న రైతులు

ఎల్.ఎన్.పేట: ఇటీవల కురిసిన వర్షాలతో పొలాలను దుక్కి చేసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఖరీఫ్ వరి సాగు జూన్‌లో ప్రారంభిస్తారు. అప్పటికి పొలాలను దుక్కి చేసి సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో వరి వెదలు జల్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరి వెదలు వేసుకోవాలంటే పొలాన్ని ఇప్పటి నుంచే మెత్తగా దుక్కిచేయాలి. ఎల్.ఎన్.పేట మండలంలో 12,850 ఎకరాల వరిసాగు విస్తీర్ణం కాగా.. ప్రతీ ఏడాది 10 వేల ఎకరాలకు పైనే వరి సాగవుతుందని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. ఈ ఏడాది కూడా పూర్తి స్థాయిలో సాగు జరిగేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు వేసవి దుక్కులు లోతుగా చేయాలని సూచించారు.

చలివేంద్రాల ఏర్పాటు



బొంతులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సారవకోట: మండలంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆదివారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ధర్మాన తేజ్‌కుమార్ ఆధ్వర్యంలో సారవకోట, బొంతు, బుడితి గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



మాట్లాడుతున్న సర్పంచ్ మంతిన రాము

నరసన్నపేట: సేంద్రియ ఎరువులు వినియోగించి ప్రకృతి వ్యవసాయం చేయడం ఎంతో మంచిదని దేవాది సర్పంచ్ మంతిన రాము అన్నారు. దేవాది పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై గ్రామసభ నిర్వహించారు. రసాయనిక ఎరువులతో వస్తున్న ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితులు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ తోట రమణ మాట్లాడుతూ దేవాది గ్రామాన్ని ఆదర్శంగా తీసుకున్నామన్నారు. రైతులు ధర్మాన అసిరినాయుడు, ధర్మాన లక్ష్మణరావు యూనిట్ ఇన్‌చార్జి రాజేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

20న అఖిల భారత సమ్మె



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పొందూరు: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం పొందూరు మండలంలోని రాపాక కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ పి.అప్పలనాయుడు, ఎ.రాధాకృష్ణ, బి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పొందూరు: ఈ నెల 12వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మీసాల మన్మథరావు ఆదివారం తెలిపారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షత ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలాధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, హాజరు కావాలని కోరారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక బంగారు వర్తక సంఘ భవనంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 15 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని వక్తలు అన్నారు. ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగా గురువు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యోగా గురువులు వారణాశి సందీప్, గిరీష్ బ్లడ్ వింగ్ వ్యవస్థాపకుడు పొట్నూరు గిరీశం, బోయిన శేఖర్, స్వప్న, రమాదర్, పద్మజ, మాధురి, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పసుపు సేకరణలో.. బిజీ.. బిజీ

- గిరిజన గ్రామాల్లో పసుపు తవ్వకం
- గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వానికి విన్నపం



పసుపు ఉడకబెడుతున్న గిరిజనులు

పాతపట్నం నియోజకవర్గంలో పసుపు పంట సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) వివరాలు..

మండలం	పసుపు పంట సాగు విస్తీర్ణం	గిరిజన రైతులు
ఎల్.ఎన్.పేట	750	1,450
పాతపట్నం	400	750
హిరమండలం	200	450
కొత్తూరు	550	1,100
మెళియాపుట్టి	650	1,400

ఎల్.ఎన్.పేట: పచ్చ బంగారంగా చెప్పుకునే పసుపు పంట దిగుబడుల సేకరణ పనుల్లో గిరిజన రైతులు బిజీగా ఉన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో గిరిజన రైతులు పోడు పంటగా పసుపు పంటను పండిస్తారు. పసుపు విత్తనాలు (కొమ్ములు) నాటుకున్న రెండు సంవత్సరాల తరువాత పంట తవ్వకాలు చేపడతారు. ఇలా తవ్విన పసుపు కొమ్ములను గిరిజనులు ఇంటికి తీసుకువచ్చి వాటిని పెద్ద, పెద్ద పాత్రల్లో వేసి ఉడికిస్తారు. తరువాత రెండు, మూడు రోజులపాటు ఎండబెట్టి శుభ్రం చేస్తారు. అంచెలంచెల ప్రక్రియ తరువాత విక్రయానికి పసుపు కొమ్ములు సిద్ధమవుతాయి.

దళారులదే పెత్తనం..

మరో నెల రోజుల్లో ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభం కానుంది. ఇలాంటి సమయంలో పసుపు తవ్వకాలు చేపట్టడం వలన వర్షాకాలం ప్రారంభానికి ముందే పంట చేతికి అంది వస్తుందని గిరిజన రైతులు చెబుతున్నారు. వర్షాలు పడితే పసుపు పంటకు మొక్కలు వస్తాయని, ఆ తరువాత తవ్వకాలు చేపట్టలేమన్నారు. ఈ ఏడాది పసుపు పంటకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేదు. క్వింటా పసుపు రూ.12 వేల ధర పలుకుతుంది. దళారులు అడిగిన ధరకు విక్రయించాల్సి వస్తుందని మండలంలోని మురగడలోవ, సూదిరాయిగూడ తదితర గ్రామాలకు చెందిన రైతులు చెపుతున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి గిట్టుబాటు ధర రూ.18 వేలు కల్పించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.



పసుపు ఎండబెడుతున్న గిరిజన రైతు ఆనపయ్య

ఉడకబెట్టే పనులు చేస్తున్నాం



ప్రస్తుతం పసుపు ఉడకబెట్టే పనులు చేస్తున్నాం. వర్షాలు పడితే పసుపు పంటకు మొక్కలు వస్తుంది. రెండు సంవత్సరాల్లో తయారైన పసుపు దుంపలు పాడైపోతాయి. వర్షాలకు ముందే పంటను తవ్వటం, ఉడికంచటం, ఎండ బెట్టిన తరువాత విక్రయించటం జరుగుతుంది. పంట దిగుబడి వచ్చే సమయంలో ధర తగ్గిపోయింది.

– సవర సింహాచలం, గిరిజన రైతు, ముగరడలోవ, ఎల్.ఎన్.పేట

బీసీ మహిళా నేతపై పోలీసుల తీరు సరికాదు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: మాజీ మంత్రి, బీసీ మహిళా నేత విడదల రజిని పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు ప్రవర్తించిన తీరు సమాజం సిగ్గుపడేలా ఉందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రజిని అనుచరుడ్ని పోలీసులు అరెస్టు చేసేందుకు వెళ్లారన్నారు. అయన్ని ఎందుకు అరెస్టు చేస్తున్నారని మాజీ మంత్రి రజిని పోలీసులను అడిగి తెలుసుకోవాలని ప్రయత్నిస్తే ఆమెను భయపెట్టారన్నారు. కేసులు పెడతామని హెచ్చరించారని, ఇది ఏ సంస్కృతికి దారి తీస్తుందన్నారు. మహిళ అని కూడా చూడకుండా ఆమెను పక్కకు నెట్టిన సీఐ తీరును తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. సభ్యత, సంస్కారం పాటించాల్సిన పోలీసులే మహిళా నేత పట్ల ఇలా ప్రవర్తిస్తే ప్రజలకు, సామాన్య మహిళలకు దిక్కెవరని ప్రశ్నించారు. కూటమి పాలనలో మంత్రి లోకేష్ రూపొందించిన రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా సంబంధిత సీఐపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

అభినందన..



మనోహర్‌ను అభినందిస్తున్న మామిడి శ్రీకాంత్

పాతపట్నం: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో 593 మార్కులు సాధించిన డొల మనోహర్‌ను శ్రీకాంత్ ఆదివారం అభినందించారు. ఆర్.ఎల్.పురం గ్రామంలోని మనోహర్ ఇంటికి వెళ్లి సత్కరించారు. పార్టీ నాయకులు బి.నారాయణమూర్తి, డొల వెంకటరావు, సంజీవ్, సతీష్, తిరుమలరావు, నాగరాజు, సవిరిగాన శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



నరసన్నపేట: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తనిఖీలు చేస్తున్న నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు



కొత్తూరు: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ప్రసాదరావు



పొందూరు: రైల్వే స్టేషన్‌లో బ్యాగులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ



మెళియాపుట్టి: మూడురోడ్ల కూడలిలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు



బూర్జ: మదనాపురం జంక్షన్‌లో కారును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ప్రవల్లిక

పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లోనిపలుచోట్ల ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రదేశాలు, కూడళ్లలో నిఘా ఉంచారు. అపరిచిత వ్యక్తుల కదలికలు, గంజాయి, మారణాయుధాలు వంటివి రవాణాపై తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

ఘనంగా మాతృ దినోత్సవం



పాతపట్నం: కొరసవాడ చర్చిలో తల్లులను అభినందించిన దృశ్యం

పాతపట్నం/ఆమదాలవలస: గృహిణిగా, ఉద్యోగిగా, కుటుంబ బాధ్యతలతోపాటు, తల్లి పాత్ర ప్రశంసనీయమని ఆంధ్రబాపిస్ట్ చర్చి పాస్టర్ ఎస్.ఫిలిప్ అన్నారు. మండలంలోని కొరసవాడ గ్రామంలో ఉన్న ఆంధ్రబాపిస్ట్ చర్చిలో మదర్స్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పిల్లలతో తల్లులను సత్కరించారు. బుగద అనిల్ కుమార్, లలిత కుమారి బెహరా, సతీష్ బెహరా, కె.లారెన్స్, రాజారావు పాల్గొన్నారు. ఆమదాలవలసలోని అరోణదయ డవలెప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలను నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు సామ్యూల్ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవత ఉత్సవాలు

మెళియాపుట్టి: చల్లగా దీవించుతల్లీ అని గ్రామదేవతలను గిరిజన ప్రజలు వేడుకున్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో చింతలపోలమ్మ తల్లి, పాతపట్నం గ్రామదేవతల 3వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముర్రాటలతో మొక్కులు చెల్లించారు. గిరిజన సంప్రదాయ బద్ధంగా అమ్మవార్లకు ఉపవాసానికి పిలిచి, అనంతరం ప్రసాదాలు పెట్టారు. వర్షాలు చక్కగా పడి, పంటలు సమృద్ధిగా పండాలని పూజలు నిర్వహించారు.

అమ్మో ఇసుక ట్రాక్టర్లు!

- నిబంధనలు పాటించని డ్రైవర్లు
- వెనుక వెళ్తున్న వాహనదారుల కళ్లల్లో పడుతున్న ఇసుక..



టార్పాలిన్ లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

కొత్తూరు:

ఇసుక ట్రాక్టర్ వస్తుందింటే కళ్లు మూసుకోవాల్సిందేనని మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుంటిభద్ర, నివగాం, పొనుటూరు, కుద్దిగాంతోపాటు పలు గ్రామాల సమీపంలోని వంశధార నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను జనావాసాల మధ్య నుంచి రవాణా చేస్తున్నారు. టార్పాలిన్లు లేకుండా ఇసుక ట్రాక్టర్లు పీహెచ్ రోడ్డు, నివగాం–అంగూరు, ఏబీ రోడ్డు, కడుము, దిమిలి, గురండి, ఆకులతంపర, అంగూరు, మదనాపురం, మెట్టూరుతోపాటు పలు ప్రధాన రహదారుల్లో ప్రతిరోజూ తరలిస్తున్నారు. ఇసుక రేణువులు ఎగిరి వెనుక వస్తున్న వాహనదారుల కళ్లల్లో పడటంతో ఇబ్బంది పడుతున్నారు. వేసవి కాలం కావడంతో ఇసుక పొడిగా తయారై మరింత పైకి ఎగురుతుంది. టార్పాలిన్లు కప్పాలని సంబంధిత అధికారులు ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

టారాల్పిన్లు కప్పకుండా ఇసుక తరలిస్తున్న టాక్టర్లపై చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణా గట్టి నిఘా వేశాం. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఎండీ అమీర్ అలీ, ఎస్ఐ, కొత్తూరు

పోలీస్‌లు స్పందించాలి



టార్పాలిన్లు కప్పకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేయాలి. టారాల్పిన్లు లేకపోవడంతో ఇసుక రేణువులు ప్రజలు కళ్లల్లో పడి పలు అవస్థలు పడుతున్నారు.

– గండివలస ఆనందరావు, కొత్తూరు

విరిగిన పలకలు



ఈ చిత్రం నరసన్నపేట మండలంలోని గొట్టిపల్లి కూడలి వద్ద సరీస్ను రోడ్డులో విరిగిన డ్రైనేజీ పలకలు. వర్షం కురిస్తే వరదనీరు ఎక్కడికక్కడ రోడ్డుపైకి వస్తుంది. పలకలు విరిగి నాలుగైదు నెలలు అవుతున్నా.. ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– నరసన్నపేట

పిచ్చిమొక్కల మధ్య కుళాయి



కొత్తూరు మండలం నివగాం గ్రామంలో పిచ్చిమొక్కల మధ్య తాగునీటి కుళాయి ఉంది. మురుగునీరు ఎటూ వెళ్లడం లేదు. తాగునీరు పట్టేందుకు కూడా ఇబ్బంది కలుగుతుంది. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించి, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కొత్తూరు

గోతులమయం



కొత్తూరు మండలంలోని నివగాం గ్రామ పీహెచ్ రహదారిలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును బాగు చేయడానికి నిధులు మంజూరైనట్లు అధికారులు చెప్పుతున్నా.. ఇంతవరకు బాగు చేయలేదు. రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– కొత్తూరు

నిర్మానుష్యంగా గ్రామాలు



ఈ చిత్రం సారవకోట మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన వీధి. ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉండటంతో గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 6.30 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలకు ఉదయం 10 గంటల లోపు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆదివారం 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదైంది.

– సారవకోట

నేటినుంచి ఆలయ ప్రారంభోత్సవాలు

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి గ్రామంలో రూ.కోటితో నిర్మాణం చేపట్టిన కోదండ రామాలయం ప్రారంభ మహోత్సవం కార్యక్రమాలు సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. అయోధ్యలో జరిగిన ప్రాణప్రతిష్ఠ రోజున ఆలయ నిర్మాణం ప్రారంభించి ప్రస్తుతం పూర్తిచేశారు. కాకినాడ నుంచి ప్రత్యేకంగా శిల్పులతో చెక్కించిన సీతారాములు, ఆంజనేయుడి విగ్రహాలు తెప్పించినట్లు తెలిపారు. మూడురోజుల పాటు నిత్యాన్నదానం, పూజలు, హోమాలు, భరతనాట్యం, సత్యహరిశ్చంద్ర, సీతాస్వయంవరం నాటకాలు, భజనా కార్యక్రమాలు, విగ్రహాల తిరువీధి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94లో 10వ తరగతి విద్యార్థుల ఆదివారం సమావేశం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి గురువులను శిమ్మినాయుడు, మల్లేశ్వరరావు, పేరిశాస్త్రిని ఘనంగా సత్కరించారు.

– సరుబుజ్జిలి

పోలీసులు ప్రజా సేవకులా? టీడీపీ ఏజెంట్లా?



మాట్లాడుతున్న జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఈశ్వరరావు

ఆమదాలవలస: మాజీ మంత్రి, బీసీ నేత విడదల రజిని పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు అనుచితంగా ప్రవర్తించిన తీరును శ్రీకాకుళం జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరం తీవ్రంగా ఖండిస్తుందని ఫోరం అధ్యక్షుడు కొప్పుల ఈశ్వరరావు అన్నారు. ఆదివారం ఆమదాలవలస పట్టణంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసులు ప్రజా సేవకులా? టీడీపీకి ఏజెంట్లా అని ప్రశ్నించారు. మహిళా నేత పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం తగదన్నారు.

దళితుల ఆత్మగౌరవంపై దాడి..

గుంటూరు జిల్లా కంతేరులో ఎంపీటీసీగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత మహిళ కల్పనను రాత్రి 3 గంటల సమయంలో పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. పోలీసులు వృత్తి ధర్మాన్ని మరచి అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారన్నారు. ఇది అరెస్టుకాదని, దళితుల ఆత్మగౌరవంపై దాడి చేయడమేనన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మహిళల రక్షణ, సామాజిక న్యాయం ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, హ్యూమన్ రైట్స్ కమిషన్‌ను కోరుతామన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు దానేటి రామ్మోహన్, పార్టీ నాయకులు తిర్లంగి గోవిందరావు పాల్గొన్నారు.

15 నుంచి క్రికెట్ పోటీలు

నరసన్నపేట: ఈ నెల 15వ తేదీ నుంచి మండలంలోని బసివలసలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నామని కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. జిల్లాకు చెందిన జట్లే పాల్గొనాలన్నారు. ఆసక్తి కలిగిన జట్లు తమ వివరాలను ఫోన్, స్వయంగా తెలియజేయాలన్నారు. 89856 24421, 99928 92591 నంబర్లను సంప్రదించాలన్నారు.